TELUGU NEWS TIMES

# తెలుగు న్యూస్ టైమ్స్

జాతీయ దిన పత్రిక

9043514736, 9840467131

చెన్నై | సంపుటి : 03 | సంచిక : 358 | బుధవారం 23 ఏప్రిల్ 2025 | ఎడిటర్ : సిహెచ్ . ముకుందరావు | పేజీలు : 04 | వేల : 03 | ONLINE E- PAPER

J.M.Nayudu
Cell: 91 9840066999
Sai Charan Comfort Inn
(Luxury Service Apartments)
Plot No. 1286 & 1345, 5th Street, Golden Colony, Anna Nagar West Extn., Mugappair, Chennai-50.
Mobile : +91 9840089859, E-mail : saicomfortinn@gmail.com

# వ్యవస్థల విధ్వంసం: వైఎస్ జగన్

- ➤➤ రాష్ట్రంలో భయానక వాతావరణం సృష్టిస్తున్న కూటమి ప్రభుత్వం
- ➤➤ తద్వారా అక్రమాలు, అవినీతి ప్రజల్లోకి వెళ్లకుండా డైవర్షన్
- ➤➤ పీఏసీ సమావేశంలో నిప్పులు చెరిగిన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్
- ➤➤ ఒక మనిషిని ఇబ్బంది పెట్టడం కోసం కుతంత్రాలు
- ➤➤ కేసుల్లో ఇరికించేందుకు తప్పుడు సాక్ష్యాల సృష్టి
- ➤➤ దుష్ట సంప్రదాయానికి తెర లేపుతున్న వైనం
- ➤➤ ఐపీఎస్ అధికారి ఆంజనేయులు అరెస్టే నిదర్శనం
- ➤➤ తొలిసారి ఇలాంటి దుర్మార్గాలు చూడాల్సి వస్తోంది
- ➤➤ నాడు లిక్కర్ విధానం విప్లవాత్మకం.. నేడు దోపిడీకి మార్గం
- ➤➤ అన్ని పథకాలకూ మంగళం.. యథేచ్ఛగా భూ పందేరాలు
- ➤➤ రాజధాని అమరావతి నిర్మాణంలో అంతులేని దోపిడీ
- ➤➤ రూ. 36 వేల కోట్ల నుంచి రూ. 77 వేల కోట్లకు పనుల విలువ పెంపు
- ➤➤ కొందరిని జైలుకు పంపితే ప్రజా వ్యతిరేకత ఆగిపోదు
- ➤➤ యుద్ధం మనకు కొత్త కాదు.. ఈ దుర్మార్గాలను నిలదీద్దాం
- ➤➤ పార్టీలో పీఏసీ అత్యున్నతం.. ఇకపై ప్రతి నెలా సమావేశం
- ➤➤ ఎప్పటికప్పుడు నిర్ణయాలతో ప్రజల పక్షాన పోరాటం



కూటమి ప్రభుత్వం దేన్నీ వదిలి పెట్టడం లేదు. వైఎస్సార్‌సీపీ మీద బురదజల్లి, డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోంది. రోమన్ రాజుల కాలంలో గ్లాడియేటర్లను పెట్టి.. గ్యాలరీల్లో మనుషులను చంపుకునే పోటీలు పెట్టేవారు. వినోదం కింద రోజుకో దుర్మార్గమైన ఆట ఆడిస్తూ ప్రజలను అందులో మునిగేలా చేసేవారు. ఇప్పుడు రాష్ట్రంలో అదే జరుగుతోంది. ఏదైనా ముఖ్యమైన సమస్య తలెత్తిన వెంటనే చంద్రబాబు డైవర్షన్ చేస్తున్నాడు. ఏమీ లేకపోతే ఎవరో ఒకర్ని తీసుకు వచ్చి జగన్ మీద మాట్లాడిస్తున్నాడు. లేకపోతే ఎవరో ఒకర్ని అరెస్టు చేస్తున్నారు. %-% వైఎస్ జగన్

రాష్ట్రంలో భయానక వాతావరణాన్ని సృష్టించి.. ప్రజా సమస్యలు, అన్యాయాలు, అక్రమాలు, అవినీతి నుంచి ప్రజల దృష్టి మళ్లించే కుట్రలో కూటమి ప్రభుత్వం నిత్యం మునిగి తేలుతోందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. వ్యవస్థలన్నీ దిగజారిపోయేలా చేస్తూ.. వాటి విధ్వంసానికి పాల్పడుతోందని, రాష్ట్రంలో మొదటిసారిగా ఇలాంటి దుర్మార్గాలు చూస్తున్నామని నిప్పులు చెరిగారు. ఇది ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో అరాచకం తప్ప ఏమీ కనిపించదన్నారు.


# నిస్సహాయులను చుట్టుముట్టి కాల్చేశారు!

- ♦ భార్యాపిల్లల ముందే పొట్టన పెట్టుకున్నారు
- ♦ పాల్గొన్నది ఐదుగురు ముష్కరులు!
- ♦ దేశవ్యాప్తంగా పెల్లుబుకుతున్న ఆగ్రహావేశాలు
- ♦ పోయి మోదీకి చెప్పుకొమ్మన్నారు
- ♦ అందుకే నన్ను ప్రాణాలతో వదిలేస్తున్నామన్నారు
- ♦ నా భర్తను కళ్లముందే దారుణంగా కాల్చేశారు : కర్నాటకకు చెందిన పల్లవి ఆవేదన



బైసారన్. పహల్గాంకు దాదాపు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉండే రిసార్ట్ పట్టణం. సుదూరాల దాకా పరుచుకున్న అందమైన మైదానాలు, పైన్ అడవులు, మంచు కొండలతో పర్యాటకులకు స్వర్గధామంగా అలరారుతుంటుంది. దశాబ్దాలుగా సినిమా షూటింగులకు, ట్రెక్కర్లకు ఇది ఫేవరెట్ స్పాట్. ఇక్కడికి చేరుకోవాలంటే కాలినడక లేదా గుర్రాలే శరణ్యం. వేసవి కావడంతో కొద్ది రోజులుగా పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు. దాంతో ఉగ్రవాదులు అదను చూసి పంజా విసిరారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. భారీ ఆయుధాలతో సమీప అడవుల్లోంచి వచ్చిపడ్డారు. రకరకాల రైడ్‌లను, స్థానిక రుచులను ఆస్వాదిస్తూ, ఫొటోలు తీసుకుంటూ సరదాగా గడుపుతున్న పర్యాటకులపై కాల్పులకు తెగబడ్డట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఊహించని దాడితో హాహాకారాలు చెలరేగాయి. పర్యాటకులంతా ప్రాణభయంతో తలో దిక్కు పరుగులు తీశారు. చుట్టూ మైదాన ప్రాంతం కావడంతో కనీసం దాక్కునే వీలు కూడా లేకుండా పోయింది. ఆ క్రమంలో రెండు పర్యాటకుల బస్సులను కూడా ఉగ్రవాదులు అడ్డుకున్నట్టు సాక్షులు తెలిపారు. వారిని ఒక్కొక్కరిగా పేర్లడుగుతూ బస్సుల్లోంచి కిందకు దించారు. హిందువులను మాత్రమే టార్గెట్ చేశారు.

పేరు తప్పు చెప్పారని అనుమానం వస్తే ప్యాంట్లు విప్పించి నిర్ధారించుకున్నారు. తర్వాత పాయింట్ బ్లాంక్‌లో కాల్చేశారు. దాంతో 26 మంది పర్యాటకులు నిస్సహాయంగా నేలకొరిగారు. 20 మందికి పైగా గాయపడ్డారు. ఎటు చూసినా శవాలు, తూటా గాయాలకు కుప్పకూలి లేవలేక అల్లాడుతున్న వాళ్లతో పరిస్థితి భీతావహంగా మారింది.



## ఇస్రో ఖాతాలో మరో ఘనత..

- ♦ స్పేడెక్స్ రెండో డాకింగ్ ప్రక్రియ సక్సెస్..
- ♦ భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టిన స్పేడెక్స్ మిషన్‌లో మరో కీలక ముందడుగు
- ♦ తొలి ప్రయోగంలో అంతరిక్షంలోనే ఉపగ్రహాలను అనుసంధానం చేసిన శాస్త్రవేత్తలు
- ♦ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించిన ఇస్రో
- ♦ "ఉపగ్రహాల రెండవ డాకింగ్ విజయవంతంగా పూర్తయిందని తెలియజేయడానికి సంతోషంగా ఉంది" : కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్


# అమరావతికి మద్దతివ్వండి

- ● అమరావతిలో క్వాంటమ్ విలేజ్ దేశంలోనే తొలిసారి
- ● హైటెక్ సిటీని తలదన్నేలా ఐకానిక్ బిల్డింగ్
- ● చరిత్రలో నిలిచిపోయేలా నిర్మించడానికి అండగా ఉండండి
- ● కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి
- ● జగన్ హయాంలోని మద్యం కుంభకోణం గురించి ప్రస్తావన?
- ● కర్నూలులో హైకోర్టు బెంచ్, పోలవరం-బనకచర్లకు సాయం
- ● అమెరికా సుంకాల నుంచి ఆక్వా రైతులను కాపాడండి
- ● కేంద్ర మంత్రులకు చంద్రబాబు వినతులు



అమరావతిలో రాజధాని నిర్మాణం శరవేగంగా పూర్తిచేసేందుకు కేంద్ర ప్రభుత్వం మద్దతు అవసరమని కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీ మే 2న ప్రారంభించనున్న రాజధాని నిర్మాణం చరిత్రలో నిలిచిపోవాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు.

# చైనా సరికొత్త హైడ్రోజన్ బాంబు



- ● ప్రయోగాత్మక పరీక్ష విజయవంతం
- ● సాధారణ బాంబు తరహాలోనే.. అయినా
- ● తీవ్ర విధ్వంసం సృష్టించే సామర్థ్యం
- ● బాంబు పేలినప్పుడు కొన్ని సెకన్ల పాటు భారీ అగ్నిగోళం
- ● 1000 డిగ్రీలకుపైగా వేడితో వినాశనం

Dr. Kolli Raju Consultant
MBS(H), M.D. (Hom)
(35 Years Experienced)
Dr. Parasa Radhamma
DHMS, M.B.S.(Homoeo)
Plot No. 137/33, 3rd Lane, Kamaraj Nagar, 5th East Street, Tiruvanmiyur, Near Bus Depot, Chennai - 600 041.
Consultation Offline and Online also available
WhatsApp Number :
94443 46846

# పీఎస్సార్ అరెస్టు

- ♦ జత్వానీ కేసులో 'ఏ2'కు సీఐడీ ఝలక్
- ♦ హైదరాబాద్‌లో వియ్యంకుడి ఇంట్లో ఉండగా అదుపులోకి
- ♦ ఫామ్‌హౌస్‌లో సోదాలు..
- ♦ పలు పత్రాలు స్వాధీనం
- ♦ అరెస్టుచేసి బెజవాడకు తరలింపు
- ♦ సీఐడీ కార్యాలయంలో విచారణ
- ♦ నేటి ఉదయం కోర్టులో హాజరు



# పార్లమెంటే సుప్రీం

- ■ దాన్ని మించిన అథారిటీ లేదు: ధన్‌ఖడ్
- ■ ప్రజాప్రతినిధులే అల్టిమేట్ మాస్టర్లు
- ■ సుప్రీంకోర్టు పరస్పర విరుద్ధ వ్యాఖ్యలు
- ■ వ్యవస్థలు పరిధి మీరితే ఉపేక్షించొద్దు
- ■ జాతి ప్రయోజనాల కోసమే మాట్లాడా
- ■ విమర్శకులపై ఉపరాష్ట్రపతి ధ్వజం



Sri Muneswara
Mob : 90032 12627 / 90032 33359
ஸ்ரீ ஸ்ரீநிவாசா ரியல் எஸ்டேட்
SRI SRINIVASA REAL ESTATE
Land Buying & Selling
No.98, Thiruneelaganda Nagar, Kavangarai, Chennai - 600 066. Email : mukeshnaveen.mg@gmail.com


# అమరావతికి మద్దతివ్వండి

విదేశీ పర్యటన ముగించుకుని సోమవారం రాత్రి ఢిల్లీకి చేరుకున్న చంద్రబాబు.. మంగళవారం అమిత్ షాతో పాటు కేంద్ర మంత్రులతో భేటీ అయి రాష్ట్ర ప్రాజెక్టులు, పథకాల గురించి చర్చించారు. 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చంద్రబాబును అమిత్ షా ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ అరాచక నిర్ణయాలతో రాజధాని నిర్మాణం ఐదేళ్లు వెనక్కు వెళ్లిందని, ఈ పరిస్థితిని సరిదిద్ది ఏపీ ప్రజలకు ఒక భవ్యమైన రాజధానిని త్వరితగతిన నిర్మించేందుకు కేంద్రం పూర్తి మద్దతునివ్వాలని కోరారు. రాష్ట్రాన్ని గాడినపెట్టేందుకు గత 10 నెలల్లో తమ ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలను ఆయన అమిత్ షాకు వివరించారు. కాగా, జగన్ హయాంలో పెద్దఎత్తున జరిగిన మద్యం కుంభకోణం గురించి కూడా చంద్రబాబు ఆయనకు వివరించినట్టు తెలిసింది. దీనితో పోలిస్తే ఢిల్లీ మద్యం కుంభకోణం చాలా చిన్నదని, దాని ద్వారా వచ్చిన అక్రమ ఆదాయాన్ని అనేక రకాలుగా మళ్లించారని ఆయన చెప్పినట్టు సమాచారం.

**కేంద్ర మంత్రులతో భేటీ**

జల్ జీవన్ మిషన్ పథకానికి కేంద్ర నిధుల మంజూరుపై కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో చంద్రబాబు చర్చించారు. ఈ పథకాన్ని రాష్ట్రంలో విస్తృత స్థాయిలో ఉపయోగించుకోవాలని భావిస్తున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని కరువు రహితంగా మార్చేందుకు ప్రతిపాదించిన పోలవరం- బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సాయం చేయాలని కోరారు. అదేవిధంగా కేంద్ర అటల్ భూజల్ యోజనపైనా కేంద్రమంత్రితో చర్చించారు. భూగర్భ జలాల వృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించి, ఈ కార్యక్రమానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్‌తో సీఎం సమావేశమయ్యారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. కాగా, ఏపీలోని ఆక్వా రైతులను ఆదుకోవాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్‌కు చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. అమెరికా సుంకాల కారణంగా ఆక్వా రంగంలో నెలకొన్న సమస్యలపై కేంద్ర మంత్రితో చర్చించారు. సీఫుడ్‌పై విధించిన 26శాతం సుంకాలు ఆక్వా రంగానికి తీవ్ర నష్టం చేస్తున్నాయని వివరించారు. అమెరికాతో చర్చించి ఆక్వా రైతులు నష్టపోకుండా చూడాలని కోరారు. చంద్రబాబు వెంట కేంద్ర మంత్రులు కింజారపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు టీడీపీ ఎంపీలు ఉన్నారు.

# ఇస్రో ఖాతాలో మరో ఘనత..

"స్పేస్-బేస్డ్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ మిషన్‌ను పీఎస్ఎల్వి - సి60 ద్వారా డిసెంబర్ 30, 2024న ప్రయోగించాం. ఈ మిషన్‌లో భాగంగా ఇస్రో శాస్త్రవేత్తలు జనవరి 16, 2025న అంతరిక్షంలో తొలిసారి ఉపగ్రహాలను విజయవంతంగా డాక్ చేసి సృష్టించారు. అనంతరం మార్చి 13, 2025న ఉదయం 9:20 గంటలకు అన్‌డాక్ చేశాం" అని ఎక్స్ పోస్ట్ ద్వారా కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఈ మిషన్ కింద రాబోయే రెండు వారాల్లో మరిన్ని ప్రయోగాలు జరగనున్నట్లు వెల్లడించారు.

మార్చి 13న, ఇస్రో తన స్పేడ్స్ మిషన్ లో భాగంగా స్పేస్ డీ-డాకింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. మన దేశం సొంతంగా అంతరిక్ష నౌకలు డాక్ చేయడానికి వీలు కల్పించే దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగు. భూమి నుంచి నావిగేషన్ చేయాల్సిన అవసరం లేకుండా ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. చంద్రయాన్-4, 2035 కల్లా అంతరిక్షంలో భారత స్పేస్ స్టేషన్ నిర్మాణం, మానవ సహిత అంతరిక్ష మిషన్లు వంటి భవిష్యత్ ప్రాజెక్టులకు ఈ సాంకేతికత చాలా అవసరం.

**మిషన్ ప్రయోజనాలు**

- ♦ భారతదేశం 2035 లో తన సొంత అంతరిక్ష కేంద్రాన్ని స్థాపించాలని యోచిస్తోంది. ఈ మిషన్ విజయం దీనికి చాలా కీలకం. భారత అంతరిక్ష కేంద్రంలో ఐదు మాడ్యూళ్లు ఉంటాయి, వీటిని అంతరిక్షంలోకి తీసుకువస్తారు. వీటిలో మొదటి మాడ్యూల్ 2028 లో ప్రారంభమవుతుంది.
- ♦ ఈ మిషన్ చంద్రయాన్-4 వంటి మానవ సహిత అంతరిక్ష ప్రాజెక్టులకు కూడా ముఖ్యమైనది. ఉపగ్రహ మరమ్మత్తు, ఇంధనం నింపడం, శిథిలాల తొలగింపు వంటి పనులు పూర్తిచేసేందుకు ఈ టెక్నాలజీ ఉపకరిస్తుంది.
- ♦ ఒకేసారి ప్రయోగించలేని భారీ అంతరిక్ష నౌకలు, పరికరాలు అవసరమయ్యే మిషన్లకు ఈ సాంకేతికత చాలా ముఖ్యమైనది.

# చైనా సరికొత్త హైడ్రోజన్ బాంబు

అణ్వస్త్రాల తరహాలో కాకుండా సాధారణ బాంబుల్లోనే అత్యధిక విధ్వంసం సృష్టించగల హైడ్రోజన్ బాంబును చైనా విజయవంతంగా పరీక్షించింది. ఏకంగా 1000 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతను వెలువరిస్తూ, కొన్ని సెకన్ల పాటు అగ్ని గోళం (ఫైర్ బాల్) నిలిచి ఉండే ఈ బాంబులతో.. తీవ్రమైన విధ్వంసం జరగడమే కాదు అల్యూమినియం అల్లాయ్ వంటి లోహాలు కరిగి, రక్షణ పరికరాలు, సామగ్రి దెబ్బతింటాయని చెబుతున్నారు. చైనా చేసిన ఈ ప్రయోగాత్మక పరీక్ష వివరాలతో సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పత్రిక తాజాగా కథనాన్ని ప్రచురించింది. చైనా షిప్ బిల్డింగ్ కార్పొరేషన్ పరిధిలోని '705 రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' ఈ హైడ్రోజన్ బాంబు పరీక్షను నిర్వహించినట్టు తెలిపింది. రెండు కిలోల మెగ్నీషియం హైడ్రైడ్ వినియోగించిన పేలుడు పరికరాన్ని.. నియంత్రిత పరిస్థితుల్లో క్షేత్రస్థాయిలో పరీక్షించినట్టు వెల్లడించింది.

**మెగ్నీషియం హైడ్రైడ్ ఇంధనంగా..**

హైడ్రోజన్‌కు ఆక్సిజన్‌ను జతకలిపినప్పుడు రసాయన చర్య జరిగి నీటిగా మారుతుంది. ఈ క్రమంలో తీవ్రమైన ఉష్ణం వెలువడుతుంది. హైడ్రోజన్‌కు ఉన్న ఈ లక్షణాన్ని ఆధారంగా చేసుకుని బాంబు తయారీ కోసం ఎప్పటి నుంచో ప్రయత్నాలు సాగుతున్నాయి. ఎక్కువ హైడ్రోజన్ ఒకచోట కావాలంటే.. దాన్ని తీవ్ర ఒత్తిడితో ట్యాంకులో నింపాల్సి ఉంటుంది. అలా బాంబు తయారు చేయడం కష్టం. ఈ క్రమంలోనే చైనా శాస్త్రవేత్తలు మెగ్నీషియం హైడ్రైడ్ పొడిని పేలుడు పదార్థంగా వాడి.. బాంబు తయారు చేశారు. ఈ బాంబు పేలడం మొదలవగానే.. మెగ్నీషియం హైడ్రైడ్ పొడి వెదజల్లినట్టుగా అవుతుంది. పేలుడు సమయంలో ఏర్పడే వేడికి కొంత మెగ్నీషియం హైడ్రైడ్ విడిపోయి.. హైడ్రోజన్ వాయువు వెలువడుతుంది. అది అంటుకుని మరింత వేడి ఉత్పత్తి అవుతుంది. ఈ వేడికి మరింత మెగ్నీషియం హైడ్రైడ్ విడిపోయి.. హైడ్రోజన్ వెలువడటం, అది మండిపోయి మరింత వేడిని విడుదల చేయడం ఒక గొలుసుకట్టు చర్యగా జరుగుతుంది. ఈ క్రమంలో పేలుడు పదార్థమంతా మండిపోయేవరకు కొన్ని సెకన్ల పాటు వెయ్యి డిగ్రీల సెల్సియస్‌కుపైగా ఉష్ణోగ్రతతో భారీ అగ్ని గోళం ఏర్పడుతుంది. అది విస్తరిస్తూ.. తీవ్ర విధ్వంసం సృష్టిస్తుంది. అతి తీవ్ర ఉష్ణోగ్రత కారణంగా.. అల్యూమినియం అల్లాయ్ వంటి లోహాలు కరిగిపోతాయి. దానితో రూపొందించే యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, ఇతర రక్షణ పరికరాలు తీవ్రంగా దెబ్బతింటాయి. నిజానికి మెగ్నీషియం హైడ్రైడ్‌ను వివిధ రంగాల్లో శక్తి ఉత్పాదన కోసం వినియోగించేందుకు అభివృద్ధి చేశారు. ఈ పదార్థాన్ని వేడి చేసినప్పుడు హైడ్రోజన్‌ను విడుదల చేస్తుంది. దాన్ని ఇంధనంగా వినియోగిస్తారు.

**అణ్వస్త్రాలకు బదులుగా..**

సాధారణంగా బాంబులలో టీఎన్‌టీ (ట్రై నైట్రో టోలిన్)ను పేలుడు పదార్థంగా వినియోగిస్తారు. దానికి కొంత పరిమితి ఉంటుంది. భారీ పేలుడు సృష్టించాలంటే ఎక్కువ స్థాయిలో టీఎన్‌టీని వినియోగించాల్సి ఉంటుంది. దీనికి బదులుగానే అణు బాంబులను అభివృద్ధి చేశారు. వాటి పేలుడు తీవ్రతతోపాటు అనంతరం రేడియేషన్ కారణంగా ఏర్పడే దుష్పరిమాణాలు ఎన్నో. ఈ క్రమంలోనే అణ్వస్త్రాల తరహాలో తీవ్ర విధ్వంసం సృష్టిస్తూనే.. తదనంతర దుష్ప్రభావాలు ఉండని బాంబుల రూపకల్పనపై అగ్రరాజ్యాలు దృష్టిపెట్టాయి. రష్యా, అమెరికాలు ఇప్పటికే ఈ తరహా బాంబులను రూపొందించాయి. తాజాగా చైనా ఆ తరహా బాంబును పరీక్షించింది.

# పార్లమెంటే సుప్రీం

ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. మన దేశంలో పార్లమెంటే సర్వోన్నతమని పునరుద్ఘాటించారు. "దాన్ని మించిన అధికారాన్ని మన రాజ్యాంగం మరే అథారిటీకీ ఇవ్వలేదు. కనీసం అలాంటి భావనకు కూడా చోటివ్వలేదు. ఆ మాటకొస్తే దేశంలోని ప్రతి పౌరుడూ సుప్రీమే. 'దేశ ప్రజలమైన మేము' అంటూ రాజ్యాంగంలో రాసుకున్న మాట అణుబాంబు వంటిది. దానికున్న శక్తి ఎంతటిదో ప్రతి ఎన్నికల్లోనూ కనిపిస్తుంది" అంటూ కుండబద్దలు కొట్టారు. "రాజ్యాంగపరమైన అంశాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులే అల్టిమేట్ మాస్టర్స్.

రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత కూడా వారిదే" అని స్పష్టం చేశారు. "రాష్ట్రపతి వంటి ఉన్నత రాజ్యాంగ పదవులు అలంకారప్రాయమైనవి మాత్రమేనని కొందరంటున్నారు. ఇది పూర్తి తప్పుడు అవగాహన. ప్రతి వ్యవస్థకూ తనవైన బాధ్యతలున్నాయి. ఇలా వాటి ప్రతిష్టను మసకబార్చజూస్తున్న దేశ వ్యతిరేక శక్తుల ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సాగనివ్వరాదు" అని అభిప్రాయపడ్డారు. మంగళవారం ఢిల్లీ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి ప్రసంగించారు. సుప్రీంకోర్టు పరిధులు దాటి వ్యవహరిస్తోందన్న తన వ్యాఖ్యలను పూర్తిగా సమర్థించుకున్నారు. వాటిని తప్పుబట్టిన వారిపై విరుచుకుపడ్డారు.

రాజ్యాంగ హోదాలో ఉండే వ్యక్తులు మాట్లాడే ప్రతి మాటకూ దేశ అత్యున్నత ప్రయోజనాలే పరమావధి అని గుర్తుంచుకోవాలన్నారు. "సుప్రీంకోర్టు పరస్పర విరుద్ధ వ్యాఖ్యలు చేసిన సందర్భాలెన్నో ఉన్నాయి. ప్రవేశిక రాజ్యాంగంలో భాగం కాదని ఒక కేసులో, భాగమేనని మరో కేసులో పేర్కొంది. వ్యవస్థలు తమ రాజ్యాంగ పరిధిని మీరినప్పుడు మౌనం వహించడం ప్రమాదకరం. వీటిపై మేధావులు స్పందించాలి. ఆస్తులను ధ్వంసం చేసే, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే శక్తులను ఏరిపారేయాలి. నయానాభయానా వినని వారికి చేదుమందు తినిపించక తప్పదు. భారతీయత పట్ల ప్రతి ఒక్కరూ గర్వించాలి" అన్నారు.

# పీఎస్సార్ అరెస్టు

ముంబై నటి కాదంబరి జత్వానీ అక్రమ అరెస్టు... ఆమె కుటుంబ సభ్యులకు వేధింపులు, బెదిరింపుల కేసులో సీనియర్ ఐపీఎస్ అధికారి, మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్సార్ ఆంజనేయులును సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఐపీఎస్ అధికారులు పీఎస్సార్, కాంతిరాణా తాతా, విశాల్ గున్నీలపై ఇప్పటికే సస్పెన్షన్ వేటుపడింది. కాంతి రాణా, విశాల్ గున్నీ హైకోర్టును ఆశ్రయించి అరెస్టు నుంచి రక్షణ పొందారు. ఈ కేసులో ఏ2గా ఉన్న పీఎస్సార్ మాత్రం, 'డీజీ స్థాయిలో ఉన్న నన్ను ఎవరూ టచ్ చేయలేరు' అన్నట్లుగా ధీమాగా ఉండిపోయారు. కానీ... సీఐడీ అధికారులు అనూహ్యంగా ఝలక్ ఇచ్చారు. మంగళవారం ఉదయం హైదరాబాద్‌లో ఆయనను అరెస్టు చేశారు. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం... హైదరాబాద్ శివారులోని మొయినాబాద్ మండలం అమడాపూర్‌లో ఐదేళ్ల కిందట పీఎస్సార్ ఆంజనేయులు 2.20 ఎకరాల భూమి కొనుగోలు చేశారు. అందులోనే ఫామ్‌హౌస్ నిర్మించుకుని అక్కడే నివసిస్తున్నారు. పీఎస్సార్ కోసం సోమవారం సాయంత్రమే సీఐడీ బృందాలు విజయవాడ నుంచి బయలుదేరి వెళ్లాయి. అయితే... పోలీసులు చేరుకునే సమయానికి ఆయన ఫామ్‌హౌస్‌లో లేరు. హైదరాబాద్ నగరంలోని కుందన్‌బాగ్‌లో ఉన్న వియ్యంకుడి ఇంటికి చేరుకున్నారు. దీంతో సీఐడీ అధికారులు మంగళవారం ఉదయం అక్కడికే వెళ్లి పీఎస్సార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆయనను అక్కడి నుంచి మొయినాబాద్ ఫార్మ్ హౌస్‌కు తీసుకెళ్లి... సోదాలు నిర్వహించారు. అక్కడ కొన్ని పత్రాలు, డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పీఎస్సార్‌ను అరెస్టు చేస్తున్నట్లు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఉదయం 8 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి... మధ్యాహ్నానికి విజయవాడ కానూరులో ఉన్న సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి తరలించి విచారించారు. ఆయనకు బుధవారం ఉదయం వైద్య పరీక్షలు నిర్వహించి... కోర్టులో హాజరు పరచనున్నారు.

**ఇదీ కేసు నేపథ్యం...**

జగన్‌కు సన్నిహితుడైన పారిశ్రామికవేత్త సజ్జన్ జిందాల్‌ను ముంబైలో నమోదైన కేసు నుంచి బయటపడేసేందుకు అప్పట్లో భారీ స్కెచ్ వేశారు. ఆయనపై ఫిర్యాదు చేసిన నటి కాదంబరి జత్వానీని బెదిరించి దారికి తెచ్చుకుని... కేసు వాపస్ చేసుకునేలా స్కెచ్ గీశారు. ఇందులో... కీలకపాత్ర అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్సార్ ఆంజనేయులుదే! ఆయన ఆదేశాల మేరకు అప్పటి విజయవాడ పోలీసు కమిషనర్ కాంతిరాణా తాతా, డీసీపీ విశాల్ గున్నీ కదిలారు. వ్యూహాత్మకంగా... జత్వానీపై వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ చేత ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ముందే పోలీసులు ముంబైకి విమాన టికెట్లను బుక్ చేసుకున్నారు. ఇదేదో జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యమున్న కేసులాగా... ఐపీఎస్ అధికారి విశాల్ గున్నీయే నేరుగా ముంబైకి వెళ్లి జత్వానీని అదుపులోకి తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కాదంబరి జత్వానీ తనకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేశారు. కుక్కల విద్యాసాగర్, పీఎస్సార్ ఆంజనేయులు, కాంతిరాణా, విశాల్‌గున్నీ, అప్పటి ఇబ్రహీంపట్నం ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్యనారాయణ, పశ్చిమ జోన్ ఏసీపీ హనుమంతరావుతోపాటు మరి కొంతమందిపై ఐపీసీ 192, 211, 218, 220, 354(డి), 467, 420, 471 రెడ్ విత్ 120(బి), ఐటీ యాక్ట్66(ఎ) సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఆ తర్వాత ఐపీసీ 193, 195, 166, 166(ఎ), 167, 342 రెడ్‌విత్ 34 సెక్షన్లను కూడా చేర్చి... సీఐడీకి బదిలీ చేశారు. కాంతి రాణా, విశాల్‌గున్నీ, హనుమంతరావు, సత్యనారాయణ తమపై కేసు కొట్టివేయాలని హైకోర్టులో ఇప్పటికే పిటిషన్లు దాఖలు చేశారు.

**నాకేం సంబంధం?**

**కాదంబరి 'బ్యాడ్ లేడీ'.. సీఐడీ విచారణలో పీఎస్సార్**

కాదంబరి జెత్వానీ అక్రమ అరెస్టుతో తనకేమీ సంబంధం లేదని పీఎస్సార్ ఆంజనేయులు పేర్కొన్నట్లు తెలిసింది. సీఐడీ కార్యాలయంలో ఆయనను మంగళవారం మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 7 వరకు కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ప్రశ్నించారు. "జెత్వానీ బ్యాడ్ లేడీ. ఆమె అరెస్టు అప్పుడు నేను ఇంటెలిజెన్స్ చీఫ్‌ను. నాకు ఈ కేసుతో ఏం సంబంధం? ఇది లోకల్ పోలీసులకు సంబంధించిన కేసు. నన్ను ఎందుకు అరెస్టు చేశారు" అని ఎదురు ప్రశ్నించినట్లు సమాచారం.

# వ్యవస్థల విధ్వంసం: వైఎస్ జగన్

చరిత్రలో తొలిసారిగా ఒక మనిషిని ఇబ్బంది పెట్టడానికి ప్రలోభపెట్టి, భయపెట్టి, తప్పుడు సాక్ష్యాలు సృష్టిస్తున్నారని చెప్పారు. ఈ పరిణామాలతో రాష్ట్రం ఎటువైపు వెళ్తోందో అర్థం కావడం లేదని, దుర్మార్గపు సంప్రదాయాలకు తెర లేపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులును అరెస్టు చేయడం దారుణమని, ఇదే కేసులో మరో ఇద్దరు పోలీసు అధికారుల పట్ల ప్రభుత్వ తీరును కోర్టు తప్పు పట్టినా పద్ధతి మార్చుకోలేదన్నారు. మంగళవారం ఆయన తాడుపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ (పీఏసీ) సమావేశంలో సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. జగన్ ఇంకా ఏమన్నారంటే..

**అసలు లిక్కర్ స్కాం ఎవరిది?**

' లోక్‌సభ సభ్యుడు మిథున్‌రెడ్డిని టార్గెట్ చేసి, ఎలాగైనా ఇరికించాలని చూస్తున్నారు. తన కాలేజీ రోజుల్లో చంద్రబాబును.. పెద్దిరెడ్డి ఎదిరించారు కాబట్టి.. ఆయన పెద్దిరెడ్డి కుటుంబంపై కక్ష పెట్టుకున్నాడు. లేని ఆరోపణలు సృష్టించి, తప్పుడు సాక్ష్యాలతో వారిని ఇబ్బంది పెడుతున్నారు. వాస్తవానికి చంద్రబాబు హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్‌పై సీఐడీ గతంలో కేసు కూడా పెట్టింది.

' లిక్కర్ అమ్మకాలు తగ్గిస్తే లంచాలు ఇస్తారా? లేక అమ్మకాలు పెంచితే లంచాలు ఇస్తారా? మద్యం అమ్మకాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే లంచాలు ఇస్తారా? లేక ప్రభుత్వం ద్వారా మాత్రమే అమ్మితే లంచాలు ఇస్తారా? మద్యం దుకాణాలను పెంచితే లంచాలు ఇస్తారా? దుకాణాలను తగ్గిస్తే లంచాలు ఇస్తారా? దుకాణాలకు తోడు పర్మిట్ రూములు, బెల్టుషాపులు పెడితే లంచాలు ఇస్తారా? లేక బెల్టు షాపులు తీసేసి, పర్మిట్ రూములు రద్దు చేస్తే లంచాలు ఇస్తారా?

' 2014%-%19 మధ్య చంద్రబాబు నిర్ణయించిన బేసిక్ రేట్లను పెంచి డిస్టిలరీల నుంచి కొనుగోళ్లు చేస్తే లంచాలు వస్తాయా? లేక పాత రేట్లు కొనసాగిస్తే లంచాలు వస్తాయా? ఇప్పుడున్న డిస్టిలరీల్లో అధిక భాగం అనుమతులు ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వంలో ఉన్న వారికి లంచాలు వస్తాయా? లేక ఏ ఒక్క డిస్టిలరీకీ అనుమతివ్వని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉన్న వారికి లంచాలు వస్తాయా? ఈ అంశాలన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

**అన్ని పథకాలకు మంగళం**

ప్రజల నోటిలోకి నాలుగు వేళ్లు ఎందుకు పోవడం లేదు? మన ప్రభుత్వ పథకాలన్నింటినీ ఎందుకు రద్దు చేశారు? సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలు ఏమయ్యాయి? ఆరోగ్యశ్రీ పూర్తిగా ఎత్తివేశారు. రూ.3,500 కోట్ల బకాయిలు ఎందుకు పెట్టారు? ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదు. ప్రతి క్వార్టర్‌కు రూ.700 కోట్లు ఇవ్వాలి.

గత ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కింద రూ.3,900 కోట్లు బకాయి పెట్టారు. ఇప్పుడు ఈ ఏడాది ప్రారంభమైంది. మళ్లీ ఈ ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా కలుపుకుంటే, మొత్తం రూ.7,800 కోట్లకు గాను రూ.700 కోట్లు ఇచ్చారు. దీనివల్ల ప్రజలు కష్టాల్లో, బాధల్లో మునిగి ప్రభుత్వ నిర్వాకాలపై దృష్టి పెట్టరని అభిప్రాయం. ఇప్పుడు చంద్రబాబు అదే చేస్తున్నారు.

**భూ పందేరాలు.. పనుల్లో యథేచ్ఛగా దోపిడీ**

లులూ గ్రూపునకు రూ.1500%-%2000 కోట్ల విలువైన భూమిని కట్టబెట్టారు. రాజధానిలో నిర్మాణపు పనుల అంచనాలను విపరీతంగా పెంచి దోచేస్తున్నారు. అప్పటి రేట్లతో పోలిస్తే స్టీల్, సిమెంటు రేట్లు పెద్దగా పెరగక పోయినా.. పెరిగాయని చెబుతూ రూ.36 వేల కోట్ల పనులను ఇప్పుడు రూ.77 వేల కోట్లకు పెంచారు. జ్యుడిషియల్ ప్రివ్యూ, రివర్స్ టెండరింగ్ తీసేశారు. మొబిలైజేషన్ అడ్వాన్స్ విధానం తీసుకొచ్చారు. ఇంత దోపిడీని గతంలో ఎప్పుడూ చూడలేదు.

**బటన్లు నొక్కితే దోపిడీకి వీలు కాదని..**

గతంలో అనేకసార్లు నేను చెప్పాను. గతంలో మనం చేసినట్టుగా చంద్రబాబు ఎందుకు బటన్లు నొక్కలేదు అని అడిగాను. బటన్లు నొక్కితే చంద్రబాబు లాంటివారికి ఏమీ రాదు. ప్రజల ఖాతాలకే నేరుగా వెళ్తుంది. అందుకనే చంద్రబాబు బటన్లు నొక్కడం లేదు. రాష్ట్రానికి సంబంధించిన ఆదాయాలు తగ్గిపోతున్నాయి. కానీ దేశ వ్యాప్తంగా ఆదాయాలు పెరుగుతున్నాయి. ప్రభుత్వ పెద్దల జేబుల్లోకి ఆదాయాలు వెళ్తున్నాయి. ఏ రైతుకూ గిట్టుబాటు ధర లేదు. పెట్టుబడి సహాయం లేదు. ఉచిత పంటల బీమా లేదు. వ్యవస్థల్లో పారదర్శకత లేదు. దాదాపు 4 లక్షల పెన్షన్లు తగ్గించారు. కొత్తగా ఒక్క పెన్షన్ ఇచ్చింది లేదు.

**గతంలోనూ మనపై తప్పుడు ప్రచారాలు**

కాంగ్రెస్ పార్టీతో విభేదించి బయటకు వచ్చినప్పుడు మనపై ఇప్పటి మాదిరిగానే తప్పుడు ప్రచారాలు, దుర్మార్గపు ప్రచారాలు చేశారు. కానీ ప్రజలు మనల్ని నమ్మారు. ఆశీర్వదించారు. ఇప్పుడు కూడా చంద్రబాబునాయుడిపై వ్యతిరేకతను కప్పి పుచ్చడానికి వాళ్ల మీడియా ప్రయత్నిస్తోంది. కానీ ప్రజల తీర్పే అంతిమం. వాళ్లిచ్చే నిర్ణయాన్ని ఎవ్వరూ మార్చలేరు. రాష్ట్రాన్ని ఒక భయంలో పెట్టి, పాలన కొనసాగించాలన్న చంద్రబాబునాయుడి ధోరణిపై కచ్చితంగా ప్రజలు తగిన రీతిలో స్పందిస్తారు.

**వక్ఫ్ చట్టం విషయంలో టీడీపీ వ్యవహార శైలిపై చర్చ**

వక్ఫ్ చట్టం సవరణ బిల్లుకు సంబంధించి టీడీపీ పార్లమెంట్ ఉభయ సభల్లో మద్దతు పలికి, కింది స్థాయిలో కప్పుదాటు వైఖరితో వ్యవహరిస్తోందని పలువురు పీఏసీ సభ్యులు వైఎస్ జగన్ దృష్టికి తెచ్చారు. టీడీపీ చేసిన ద్రోహాన్ని మైనార్టీలు ఎండగడుతున్నారని.. ఊరూరా ర్యాలీలు, ధర్నాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా జగన్ స్పందిస్తూ.. వక్ఫ్ చట్టం అన్నది కేవలం ఒక మతానికో, ఒక వర్గానికో సంబంధించినది కాదని, రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన, ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగింది కాబట్టే దీనిపై న్యాయపరంగా పోరాడేందుకు సుప్రీంకోర్టులో కేసు వేశామని చెప్పారు.

రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గడం గురించి సమావేశంలో చర్చకు వచ్చింది. ధాన్యం, పెసలు, మినుములు, కందులు, శనగలు, పొగాకు, మిర్చి, అరటి, టమాటా, కోకో సహా అన్ని పంటల ధరలు తగ్గిపోయాయని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆక్వా రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారని, టారిఫ్‌ల బూచి చూపి రైతులను నిలువునా దోచుకున్నారని చెప్పారు.

# హైదరాబాద్‌లో అత్యాధునిక చిన్న ఆయుధాల తయారీ కేంద్రం

ఐకామ్ భాగస్వామ్యంతో ఏర్పాటు




హైదరాబాద్ : దేశ రక్షణ రంగంలో కీలక పాత్ర పోషించే ప్రపంచ శ్రేణి చిన్న ఆయుధాల తయారీ కేంద్రాన్ని హైదరాబాద్‌లో మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) గ్రూపునకు చెందిన ఐకామ్ ఏర్పాటు చేసింది. ఐకామ్ సమీకృత ఇంజనీరింగ్ విభాగం ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ ఆయుధ తయారీ కేంద్రాన్ని సోమవారం ఐకామ్ టెలీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సుమంత్ పాతూరు, క్యారకల్ సిఇఒ హమద్ అల్ అమెరి సంయుక్తంగా ప్రారంభించారు. మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా ఇక్కడ తయారయ్యే ఆయుధాలు భారత సాయుధ దళాలు, సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్సెస్ (సిఎపిఎఫ్ఎస్), సాయుధ బలగాలు, రాష్ట్ర పోలీస్ బలగాలు, ఎస్‌పిజి వంటి సంస్థల కీలక అవసరాలను తీరుస్తాయని ఆ సంస్థ పేర్కొంది. అలాగే క్యారకల్ సంస్థ ప్రపంచంలోని వివిధ దేశాలకు ఆయుధాల్ని ఎగుమతి చేసేందుకు హైదరాబాద్‌లోని ఆయుధ తయారీ కేంద్రం ఉపయోగపడు తుందని తెలిపింది. యుఎఇ సంస్థ భారత దేశానికి తొలిసారి చిన్న ఆయుధాల తయారీకి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తోందని వెల్లడించింది. దేశంతో పాటు ప్రపంచానికి ఉపయోగపడే విధంగా ఆయుధాలను తయారు చేస్తున్నామని సుమంత్ పాతూరు తెలిపారు. ఇది యుఎఇ-భారతదేశ రక్షణ సహకారంలో ఒక మైలురాయిని సూచిస్తుందన్నారు.

# చెలామణిలో నకిలీ నోట్లు

**నోట్ల రద్దు సమయంలో ఇలాంటి నోట్లు కనబడవన్న మోడీ సర్కార్**

**గుజరాత్ నుంచే అత్యధికంగా ఫేక్‌నోట్ల ముద్రణ**

**దేశంలో నకిలీ కరెన్సీ మళ్లీ కలకలం సృష్టిస్తున్నది. ఆనాడు ఆదరాబాదరాగా చేసిన నోట్ల రద్దు నిర్ణయాన్ని ప్రతిపక్షాలు, ప్రజలు తప్పుబట్టినా మోడీ సర్కార్ వినలేదు. పైగా ఎన్నో జాగ్రత్తలు తీసుకుని పెద్దనోట్లను తెస్తున్నామని, ఇది బ్లాక్‌మనీని, నకిలీ కరెన్సీని అరికడుతుందని ప్రకటించింది. ఇపుడు రూ.500 నోట్లు నకిలీవి వస్తున్నాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కేంద్రహోంశాఖ హెచ్చరిక చేస్తోంది. అంటే నకిలీ కరెన్సీని అడ్డుకోలేని కేంద్రంలోని బిజెపి సర్కారు ఆడలేక మద్దెల ఓడు అన్నట్టుగా వ్యవహరిస్తోందని ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.**

న్యూఢిల్లీ : దేశంలో నకిలీ నగదు చెలామణిలో [illegible] ముఖ్యంగా, గుజరాత్‌లో ఇలాంటి ఘటనలు ఎక్కువగా నమోదవుతున్నట్టు గణాంకాలు చెప్తున్నాయి. నవంబర్ 8, 2016న కేంద్రంలోని మోడీ సర్కారు పెద్ద నోట్ల రద్దును అమలు చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఎటిఎంల ముందు క్యూలైన్లలో నిలబడి జనం ప్రాణాలు సైతం కోల్పోయారు. పెద్ద నోట్ల రద్దుపై మోడీ తన టెలివిజన్ ప్రసంగంలో ప్రకటన చేశారు. "అవినీతి, నల్లధనం, నకిలీ నోట్లు, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే ఈ పోరాటంలో, మన దేశాన్ని శుద్ధి చేసే ఈ ఉద్యమంలో, మన ప్రజలు కొన్ని రోజులు కష్టాలను భరించలేరా? ప్రతి పౌరుడూ నిలబడి ఈ 'మహాయజ్ఞం'లో పాల్గొంటారని నాకు పూర్తి నమ్మకం ఉంది" అని అన్నారు. ఆయన చెప్పినట్టుగా అవినీతి



కానీ, నల్లధనం కానీ అంతం కాలేదన్నది అనుభవం చెబుతున్న సత్యం. ఒకవేళ కేంద్రం చెప్పినట్టుగానే జరిగి ఉంటే.. వీటిపై స్పష్టమైన గణాంకాలను విడుదల చేసి ఉండేదని విశ్లేషకులు అంటున్నారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించని కారణంగానే బిజెపి సర్కారు అలాంటి సాహసం చేయలేదని చెప్తున్నారు. నల్లధనానికి పెద్దనోట్లు కీలకంగా మారాయని చెప్పిన మోడీ సర్కారు.. నోట్ల రద్దు తర్వాత రూ.2 వేలు నోటును తీసుకురావటానికి గల కారణాన్ని వారు ప్రశ్నించారు. ఇంతలో 'పెద్దోళ్ల లెక్కలు తేలాయోవెూ?' అని వారు అనుమానాలను వ్యక్తం చేశారు.డీమానిటైజేషన్ తర్వాత లెక్కకు రాని సంపదను మోడీ సర్కారు తొలగిస్తుందని అంతా భావించారు. కానీ, మోడీ సర్కారు అలా చేయలేదు. 2017లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ లెక్కల్లో లేని సంపద పెద్ద ఎత్తున డిపాజిట్ కాలేదని చెప్పారు. ఆ తర్వాత ఏడాది..రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) కూడా ఇదే విషయాన్ని చెప్పింది. దాదాపు 99.3 శాతం రద్దు చేయబడిన కరెన్సీ బ్యాంకులకు తిరిగి వచ్చిందని వివరించింది. అంటే అవినీతి, నల్లధనం అంతం అంటూ మోడీ చెప్పినా.. అవి వాస్తవరూపం దాల్చలేదన్నది అందరికీ తెలిసిందే.

ఏటికేడూ పెరిగిన ఫేక్ కరెన్సీ జప్తు2016లో రూ.15.92 కోట్ల విలువైన నకిలీ కరెన్సీ జప్తు జరిగింది. తర్వాతి సంవత్సరాల్లో ఇవి గణనీయంగా పెరిగాయి. వీటి విలువ 2017లో రూ.28.10 కోట్లు, 2018లో రూ.17.95 కోట్లు, 2019లో రూ.25.39 కోట్లు, 2020లో రూ.92.17 కోట్లు, 2021లో రూ.20.39 కోట్లుగా నమోదయింది. 2021 తరువాత సంవత్సరాల గణాంకాల ప్రకారం వరుసగా రూ. 28.10 కోట్లు, రూ. 17.95 కోట్లు, రూ. 25.39 కోట్లు, రూ. 92.17 కోట్లు, రూ. 20.39 కోట్లుగా ఉంది. వాస్తవానికి.. 2015లో నోట్ల రద్దుకు ముందు రూ.15.48 కోట్ల నకిలీ కరెన్సీ మాత్రమే స్వాధీనం కావటం గమనార్హం.

ఆందోళన కలిగిస్తున్న నకిలీ నోట్లు

నిజానికి పెద్ద నోట్ల రద్దు తర్వాత దేశంలో నకిలీ నోట్ల కలకలం పెరిగింది. మరీ ముఖ్యంగా.. దాదాపు ఆరేడేళ్ల తర్వాత.. 2022-23 ఆర్థిక సంవత్సరంలో నకిలీ రూ.500 నోటు చెలామణీ పెరుగుదలను చూసింది. 14.4 శాతం పెరుగుదలను నమోదు చేసింది. ఆర్‌బిఐ ఈ సమాచారాన్ని వెల్లడించింది. ఆర్‌బిఐ వార్షిక నివేదిక ప్రకారం.. బ్యాంకింగ్ వ్యవస్థలో 91,110 నకిలీ రూ.500 నోట్లు వచ్చి చేరాయి. అంటే, వాటి విలువ రూ.4.55 కోట్లు అన్నమాట. ఇది గత సంవత్సరం గణాంకాల కంటే పెరుగుదలను నమోదు చేయటం గమనార్హం. గతేడాది మొత్తం రూ. 3.98 కోట్లు విలువ ఉన్న 79,669 నకిలీ నోట్లు కనుగొనబడ్డాయి.

ఆ రూ.500 నోట్లతో జాగ్రత్త.. కేంద్ర హెూం శాఖ హెచ్చరికలు

అత్యాధునిక టెక్నాలజీ వాడి తయారుచేసిన రూ.500 దొంగనోట్లు చెలామణీలోకి వచ్చినట్టు కేంద్ర హెూంశాఖ తాజాగా హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు వీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని వివరించింది. ఈ సమాచారాన్ని డిఆర్ఐ, ఎఫ్ఐయు, సిబిఐ, ఎన్ఐఎ, సెబీతో కూడా పంచుకున్నది. ఆ దొంగనోట్ల ప్రింటింగ్, నాణ్యత చాలావరకు అసలు నోట్లలాగే ఉన్నట్టు వెల్లడించింది. వాటిని గుర్తించడం కూడా చాలా క్లిష్టంగా మారిందని వివరించింది. ఈ నోట్లలో ఒక చిన్న స్పెల్లింగ్ తప్పు ఉన్నదని పేర్కొన్నది. దీనిని గుర్తించడంలో అదే కీలకమని వివరించింది. 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'లో 'ఇ'కి బదులు 'ఎ' పడినట్టు పేర్కొన్నది. ఈ చిన్న తప్పును గుర్తించాలంటే ఆ నోటును క్షుణ్ణంగా పరీక్షించాల్సి ఉంటుందని వివరించింది. ఇలాంటి నకిలీ నోట్లు అత్యంత ప్రమాదకరమని వెల్లడించింది. వీటి విషయంలో ఆర్థిక సంస్థలు, బ్యాంకులు, ఏజెన్సీలను అప్రమత్తంగా ఉంచినట్టు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఇవి మార్కెట్లో ఉన్నాయని హెచ్చరించారు.

# దేశీయ మార్కెట్లు ఫ్లాట్‌గా ప్రారంభం



బిజినెస్ : దేశీయ మార్కెట్లు మంగళవారం ఫ్లాట్‌గా ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సంకేతాలు పతనంగా కనిపిస్తుండటంతో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఐదు రోజులుగా కొనసాగుతోన్న సూచీల దూకుడు కాస్త నెమ్మదించింది. సెన్సెక్స్ 72 పాయింట్ల లాభంతో, నిఫ్టీ 24వేల ఎగువన ట్రేడింగ్ మొదలుపెట్టాయి. ఉదయం 9 గంటల 30 నిముషాల సమయంలో సెన్సెక్స్ 72 పాయింట్ల లాభంతో 79,480 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 20 పాయింట్ల లాభంతో 24,146 వద్ద ఉంది. నిఫ్టీ సూచీలో టాటా స్టీల్, కొటక్ మహీంద్రా, శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్, భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు లాభాల్లో కదలాడుతున్నాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, హీరో మోటార్‌కార్ప్ లిమిటెడ్, బజాజ్ ఆటో, ఇన్ఫోసిస్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు నష్టాలతో ప్రారంభమయ్యాయి. అమెరికా మార్కెట్లు సోమవారం నష్టాల్లో కొనసాగాయి. ఫెడ్ రిజర్వ్ ఛైర్మన్ పావెల్‌పై డొనాల్డ్ ట్రంప్ విసుర్లు కొనసాగుతుండడం ఇందుకు నేపథ్యం. ఆ ప్రభావంతో ఆసియా మార్కెట్లు మిశ్రమంగా కదలాడుతున్నాయి.

# ఎన్‌టిపిసితో ఎవ్రెన్ ఒప్పందం

న్యూఢిల్లీ: బ్రూక్‌ఫీల్డ్, యాక్సిస్ ఎనర్జీ గ్రూపు సంయుక్త భాగస్వామ్యంలోని ఎవ్రెన్ తాజాగా దేశంలోనే అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి కంపెనీ ఎన్‌టిపిసితో ఒప్పందం కుదర్చుకున్నట్లు ప్రకటించింది. డిస్పాచబుల్ పునరుత్పాదక ఇంధన సరఫరా కోసం 300 మెగావాట్ విద్యుత్ కొనుగోలు కోసం ఒప్పందం చేసుకున్నట్లు పేర్కొంది. విద్యుత్ డిమాండ్ ఉన్న సమయంలో ఇంధన సరఫరా కోసం సౌర, పవన, బ్యాటరీ స్టోరేజ్‌ను సమర్థవంతంగా పంపిణీ చేయనున్నట్లు పేర్కొంది. ఈ పునరుత్పాదక సరఫరా వల్ల గరిష్ఠ డిమాండ్ సమయాల్లో విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి సహాయపడుతుందని తెలిపింది.




# ఐసిఐసిఐ బ్యాంక్‌కు రూ.12,630 కోట్ల లాభాలు

**ప్రతీ షేర్‌పై రూ.11 డివిడెండ్**

ముంబయి : గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 18 శాతం వృద్ధితో రూ.12,629 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.10,708 కోట్ల లాభాలు నమోదు చేసింది. 2024-25 తుది డివిడెండ్ కింద రూ.2 ముఖ విలువ కలిగిన షేర్‌పై రూ.11 డివిడెండ్ చెల్లించడానికి ఆ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. దీనికి కంపెనీ వార్షిక సాధారణ సమావేశంలో ఆమోదం లభించాల్సి ఉంటుంది. 2024-25లో స్థూల నికర లాభాలు 15.5 శాతం పెరిగి రూ.47,227 కోట్ల నికర లాభాలు సాధించింది.




గడిచిన క్యూ4లో ఐసిఐసిఐ బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 11 శాతం పెరిగి రూ.21,193 కోట్లకు చేరింది. డిపాజిట్లు 11.4 శాతం పెరిగి రూ.14,86,635 కోట్లకు చేరాయి. 2025 మార్చి 31 నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 1.67 శాతానికి తగ్గాయి. ఇంతక్రితం ఏడాది ఇదే సమయం నాటికి 2.16 జిఎన్‌పిఎ చోటు చేసుకుంది. ఇదే సమయంలో 0.42 శాతంగా ఉన్న నికర ఎన్‌పిఎలు.. గడిచిన మార్చి ముగింపు నాటికి 0.39 శాతానికి తగ్గాయి.

# ఐదో సెషన్‌లోనూ మార్కెట్ల పరుగు

## సెన్సెక్స్‌కు 855 పాయింట్ల లాభం



ముంబయి : దలాల్ స్ట్రీట్ వరుసగా ఐదో సెషన్‌లోనూ లాభాల్లో సాగింది. అమెరికా టారిఫ్‌ల ఆందోళనలు తగ్గుముఖం పట్టాయనే అంచనాల్లో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపుతున్నారు.


ఈ నేపథ్యంలోనే సోమవారం సెన్సెక్స్ 79వేల మార్క్‌ను దాటింది. ముఖ్యంగా బ్యాంకింగ్ షేర్లు ప్రధాన మద్దతును అందించాయి. తుదకు బిఎస్ఇ సెన్సెక్స్ 855 పాయింట్లు పెరిగి 79,408.50కు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 274 పాయింట్లు లాభపడి 24,126 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, ఇండస్ ఇండ్ బ్యాంక్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. అదానీ పోర్ట్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఐటిసి, ఏషియన్ పెయింట్స్, నెస్లే ఇండియా షేర్లు అధిక నష్టాలను చవి చూసిన వాటిలో ఉన్నాయి.

# బిగ్ బ్యాటరీతో ఒప్పో కె13 5జి విడుదల




న్యూఢిల్లీ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల కంపెనీ ఒప్పో సోమవారం తన కొత్త ఒప్పో కె13 5జి స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. బిగ్ బ్యాటరీ 7000 ఎంఎహెచ్‌తో ఆవిష్కరించింది. 8జిబి, 128జిబి వేరియంట్ ధరను రూ.17,999గా, 8జిబి, 256జిబి ధరను రూ.19,999గా నిర్ణయించింది. ఏప్రిల్ 25 నుంచి మార్కెట్‌లో లభించనుందని తెలిపింది. వెనుకవైపు 50 ఎంపి కెమెరా, 2 ఎంపి సెకండరీ కెమెరా, సెల్ఫీ కోసం 16ఎంపి కెమెరాను అమర్చింది.

# 25, 26 తేదీల్లో వైస్ ఛాన్సలర్ల సదస్సు



**విల్లివాకం న్యూస్:** ఈ నెల 25, 26 తేదీల్లో నీలగిరి జిల్లా, ఊటీలో తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి అధ్యక్షతన వైస్ ఛాన్సలర్ల సదస్సు జరగనుంది. ఈ నేపథ్యంలో గవర్నర్ హౌస్ జారీ చేసిన నోటిఫికేషన్‌లో.. వైస్ ఛాన్సలర్ల సదస్సుకు ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. గవర్నర్ ఆర్ ఎన్ రవి అధ్యక్షతన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ల సదస్సును వైస్ ప్రెసిడెంట్ జగదీప్ ధన్కర్ ప్రారంభిస్తారని సమాచారం. తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి నీలగిరిలో వైస్ ఛాన్సలర్ల సదస్సును నిర్వహించనుండగా.. ఈ సదస్సును పలువురు రాజకీయ నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ సదస్సును తమిళనాడు ప్రభుత్వం చట్టబద్ధంగా నిలిపివేయాలని లిబరేషన్ టైగర్స్ ఆఫ్ ఇండియా అధినేత తిరుమావళవన్ సహా పార్టీ నేతలు పట్టుబడుతున్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ బిల్లులకు గవర్నర్ ఆమోదం



**విల్లివాకం న్యూస్:** ప్రైవేట్ యూనివర్సిటీ సవరణ బిల్లు మరియు తమిళనాడు పబ్లిక్ బిల్డింగ్ లైసెన్స్ సవరణ బిల్లు అనే రెండు బిల్లులను తమిళనాడు అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించారు. తమిళనాడు ప్రభుత్వం ఈ బిల్లులను గవర్నర్ ఆమోదం కోసం పంపింది. ఇప్పుడు ఈ రెండు బిల్లులకు గవర్నర్ ఆర్.ఎన్. రవి ఆమోదం తెలిపారు. గవర్నర్ ఆమోదం తెలపకుండా బిల్లులను పెండింగ్‌లో ఉంచడం చట్ట విరుద్ధమని సుప్రీంకోర్టు ఏప్రిల్ 8న తీర్పునిచ్చింది. తీర్పు వెలువడిన తరుణంలో ఆయన ప్రస్తుతం రెండు బిల్లులను ఆమోదించారు.

# టాస్మాక్ లో 100 కోట్ల మోసం - ఇపిఎస్ సంచలనాత్మక ఆరోపణ



**అన్నానగర్ న్యూస్:** ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామితో మాట్లాడేందుకు అనుమతి నిరాకరించడాన్ని నిరసిస్తూ అన్నాడీఎంకే సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ఆ సమయంలో విలేకరులతో సమావేశమైన ఎడప్పాడి పళనిస్వామి మాట్లాడుతూ.. ఈరోజు అసెంబ్లీ స్పీకర్ ప్రవర్తించిన తీరు ప్రజాస్వామ్య హత్య.ఒక రంగం సమస్యను 10 నిమిషాల్లో ఎలా చర్చించగలరు? నిర్మాణాత్మకంగా అభిప్రాయాలను వ్యక్తీకరించడానికి సమయం ఇవ్వడానికి వారు నిరాకరిస్తారు.ప్రజలు తమ సమస్యల గురించి బయటకు చెప్పుకోవడానికి అనుమతించకపోవడం ఖండించదగినది. అన్నాడీఎంకే. ప్రభుత్వంలోని ప్రతి ఒక్కరికీ మాట్లాడే అవకాశం ఇచ్చాము.నేను సరిగ్గా అనుమతి అడిగాను. “తప్పు అయితే తొలగించు” అని నేను అన్నాను.%ూూహీూజ% ప్రధాన కార్యాలయంలో జరిగిన ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడికి ఎవరూ స్పందించలేదు.ఎవరూ స్పందించకపోవడంతో, రూ. 1000 కోట్ల మోసం ఫిర్యాదు రుజువైంది.మద్యం అదనంగా రూ.20కి అమ్మడం ద్వారా రూ.1000/-కు అమ్ముడుపోయారని ఆయన అన్నారు.

# పొన్నేరిలో మహిళల మన్నానికి మద్దతుగా బీజేపీ నిరసన

**తిరువళ్లూరున్యూస్:**తమిళనాడు మంత్రివర్గ సభ్యుడు పొన్ముడి ఇటీవల చేసిన వ్యాఖ్యలు మహిళలను కించపరిచేలా ఉన్నాయని ఆరోపిస్తూ, తిరువళ్లూరు తూర్పు జిల్లా పొన్నేరిలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా, పొన్నేరి తెరడి నుంచి ప్రారంభమైన ర్యాలీలో 100 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. మంత్రి పొన్ముడి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వారు బ్యానర్లు పట్టుకుని నినాదాలు చేస్తూ అన్నా విగ్రహం వరకు కవాతు చేశారు. ఆ తర్వాత జరిగిన నిరసనలో బీజేపీ కార్యకర్తలు మంత్రి



మాటలపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ, బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దారుణమని పేర్కొన్నారు. మహిళల గౌరవానికి మద్దతుగా నిలవాలని ప్రభుత్వాన్ని కోరుతూ నినాదాలు చేశారు.

# శివచంద్రన్ కు స్టాలిన్ శుభాకాంక్షలు



**విల్లివాకం న్యూస్:** యూపీఎస్సీ పరీక్ష ఫలితాలలో ఉత్తీర్ణత సాధించిన శివచంద్రన్ కు ముఖ్యమంత్రి స్టాలిన్ శుభాకాంక్షలు తెలిపారు. యూపీఎస్సీ పరీక్ష ఫలితాలు నేడు వెలువడ్డాయి. ఇందులో తమిళనాడుకు చెందిన శివచంద్రన్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం, అఖిల భారత స్థాయిలో 23వ స్థానం సాధించారు. తమిళనాడు ప్రభుత్వ నాన్ ముదల్వన్ పథకంలో చదువుకున్నాడు. ఈ విషయమై శివచంద్రన్ మాట్లాడుతూ.. యూపీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించినందుకు సంతోషంగా ఉంది.. పరీక్షలో విజయం సాధించేందుకు నాన్ ముదల్వన్ ప్రోగ్రామ్ దోహదపడింది. అదేవిధంగా భారత్‌లో 39వ ర్యాంక్‌లో ఉన్న మోనికా కూడా నాన్ ముదల్వన్ పథకం కింద శిక్షణ పొందింది. నాన్ ముదల్వన్ కింద శిక్షణ పొందిన 134 మందిలో 50 మంది 2024 యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. 50 మందిలో 18 మంది పూర్తి సమయం రెసిడెన్షియల్ ట్రైనీలు. అలాగే తమిళంలో పరీక్ష రాసిన కామరాజ్, తంగపాండియన్ ఇద్దరూ ఉత్తీర్ణులయ్యారు. ఈ కార్యక్రమం పదివేల మంది విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరుస్తుందని మరియు భవిష్యత్తులో లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపుతుందని మా ప్రగాఢ విశ్వాసమని కొందరు విద్యార్థులు తెలిపారు.

# 26 వరకు స్వల్ప వర్ష సూచన



**విల్లివాకం న్యూస్:** చెన్నై వాతావరణ పరిశోధనా కేంద్రం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఇలా పేర్కొంది. ఆగ్నేయ తీరంలో వాతావరణం అల్పప్రసరణ ఏర్పడింది. దక్షిణ భారత ప్రాంతాల పైన, వాతావరణం యొక్క దిగువ భాగంలో, తూర్పు మరియు పడమర గాలులు కలిసే ప్రాంతం ఉంది. దీని ప్రభావంతో తమిళనాడులోని పుదువై, కారైకల్ ప్రాంతాల్లో మంగళ, బుధ వారాలలో రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మంగళవారం నుంచి 26వ తేదీ వరకు తమిళనాడు, పుదువై, కారైకల్‌లలో గరిష్ట ఉష్ణోగ్రతల్లో పెను మార్పులు వచ్చే అవకాశం లేదు. అయితే ఒకటిరెండు చోట్ల స్వల్పంగా పెరగవచ్చు. మంగళ, బుధ వారాలలో తమిళనాడు, పుదువై మరియు కారైకాల్‌లోని కొన్ని చోట్ల గరిష్ట ఉష్ణోగ్రత సాధారణం కంటే 2-3ళీ సెల్సియస్ ఎక్కువగా ఉండవచ్చు.

# త్వరలో విద్యుత్ శాఖలో ఖాళీ పోస్టుల భర్తీ



**విల్లివాకం న్యూస్:** విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయనున్నట్లు మంత్రి సెంథిల్ బాలాజీ తెలిపారు. అసెంబ్లీలో విద్యుత్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి సెంథిల్ బాలాజీ మాట్లాడుతూ.. 600 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు కొత్త అణువిద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తారన్నారు. తీరప్రాంత నగరాల్లోని ఓవర్ హెడ్ విద్యుత్ లైన్లు అండర్ గ్రౌండ్ లైన్లుగా మారుతాయి. రైతులకు ఈ ఏడాది 50 వేల కొత్త విద్యుత్ కనెక్షన్లు అందించనున్నారు. తమిళనాడు విద్యుత్ పంపిణీ సంస్థలో రూ.215 కోట్లతో కొత్త సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. రూ.55 కోట్లతో 26 సబ్ స్టేషన్లలో విద్యుత్ కన్వర్టర్ల నవీకరణ జరగనుంది. తూత్తుకుడి, మెట్టూరు, ఉత్తర చెన్నై థర్మల్ పవర్ స్టేషన్లలో రూ.500 కోట్లతో విద్యుత్ ఉత్పత్తి పనులు చేపట్టనున్నారు.

# శివాలయాలలో చితిరై మాసంలో ప్రత్యేక తిరువోణం పూజలు

**అన్నానగర్ న్యూస్:** చితిరై మాసంలో తిరుఓణం సందర్భంగా శివాలయాలలో ప్రత్యేక అభిషేకం మరియు పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆయా ప్రాంతాల ప్రజలు ఇందులో పాల్గొని దేవత దర్శనం చేసుకున్నారు. ధర్మపురి కుమారసామిపేటలోని శివసుబ్రమణ్యం ఆలయ సముదాయంలోని శ్రీ శివకామసుందరీ సమేత శ్రీ మఠం ఆనంద నటరాజ సభలో చితిరై మాసం తిరువోణం నక్షత్రం సందర్భంగా కలశ స్థాపన, విఘ్నేశ్వర పూజ, సంకల్పం, మూలవర్ తిరుమంజనంతో పాటు విశేష ఆరాధన కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి.దీని తరువాత పుష్పాంజలి, సోడస ఉపసారం, వేద పారాయణం, మరియు ఉచ్ఛారణ కాలంలో పంచ పురాణ పారాయణం జరిగాయి. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ సేవ, మహా దీపారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులకు ప్రత్యేక ప్రసాదాలు అందజేశారు.ధర్మపురి ఆతుమేడులోని శ్రీ నంజుండేశ్వర ఆలయంలో పాలు, పనీర్, గంధం, పసుపు, విభూతి మరియు వివిధ రకాల పండ్లతో సహా సుగంధ ద్రవ్యాలతో స్వామికి ప్రత్యేక అభిషేకం మరియు పూజలు జరిగాయి. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ సేవ, మహా దీపారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అదేవిధంగా, ధర్మపురి వీవర్ నగర్‌లోని మంగళాంబికై దేవితో ముడిపడి ఉన్న శ్రీ మహాలింగేశ్వరర్ ఆలయంలో చితిరై మాసంలో




తిరువోణం సందర్భంగా ప్రత్యేక అభిషేకం మరియు పూజా కార్యక్రమాలు జరిగాయి. ధర్మపురి కడయవీధిలోని శ్రీ అంబికా పరమేశ్వరి అమ్మవారికి కొలువుదీరిన శ్రీ మరుధవనేశ్వర ఆలయం, అన్నసాగరం రోడ్‌లోని శ్రీ సిద్ధలింగేశ్వర ఆలయం, చేవల్‌పట్టిలోని శ్రీ ఆదిలింగేశ్వరాలయం, మధికోనపలయం శివాలయం, మధిలింగేర్‌తేశ్వరాలయం, ధర్మపురి పరిసర ప్రాంతాల్లోని అన్ని శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.కిల్పెన్నత్తూరులోని శ్రీ మీనాక్షి సుందరేశ్వర ఆలయంలో శ్రీ శివగామి సమేత నటరాజు, మాణిక్కవాసులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు పసుపు, కుంకుమ, పాలు, పెరుగు, విభూతి, పనీర్, తేనె, పంచామృతం వంటి 18 రకాల పదార్థాలతో అభిషేకం చేశారు. భక్తులు నటరాజ స్వామిని ప్రత్యేక రాజ వస్త్రాలు ధరించి, ఆరాధన చేసి, పుష్పాలు సమర్పించి పూజించారు.

# కోయంబత్తూరులో విడిది చేస్తున్న రాజకీయ ప్రముఖులు - ఉత్సాహంగా స్వచ్ఛంద సేవకులు

**గిండి న్యూస్:** కోయంబత్తూరులోని చెట్టిపాళయం ప్రాంతంలో 27వ తేదీ ఆదివారం జల్లికట్టు పోటీలు జరుగుతాయి. ఈ పోటీలను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ప్రారంభిస్తారు.ఆ తరువాత అటవీ శాఖ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో పెట్టికుట్టై వన్యప్రాణుల పునరావాస కేంద్ర భవనాన్ని ప్రారంభించి, అటవీ శాఖ సిబ్బందికి అందించిన ఆధునిక ఆయుధాలను పరిశీలిస్తారు.సాయంత్రం, ఆయన ఆర్.ఎస్.పురం లో జరిగే ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొంటారు. కార్పొరేషన్ స్కూల్ మైదానంలో లబ్ధిదారులకు సంక్షేమ సహాయం అందించడం. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన హాకీ స్టేడియం నిర్మాణాన్ని కూడా ఆయన ప్రారంభిస్తున్నారు.ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ 26వ తేదీ సాయంత్రం కోయంబత్తూరు వస్తున్నారు. ఆయనకు డీఎంకే నిర్వాహకులు సమావేశమై ఆత్మీయ స్వాగతం పలకబోతున్నారు.అదేవిధంగా, డిఎంకె. డిప్యూటీ జనరల్ సెక్రటరీ కనిమొళి ఎంపీ కూడా కోయంబత్తూరుకు వెళ్లనున్నారు. డిఎంకె. మహిళా జట్టు తరపున 25వ తేదీ సాయంత్రం కనియూర్ సమీపంలోని ఒక ప్రైవేట్ హాలులో సెమినార్ జరుగుతుంది.

ఈ సెమినార్‌కు కనిమొళి ఎంపీ ప్రత్యేక అతిథిగా హాజరయి ప్రసంగిస్తారు. కోయంబత్తూరు పర్యటనకు వస్తున్న ఎంపీ కనిమొళికి డీఎంకే పార్టీ ఉత్సాహభరితమైన స్వాగతం పలుకనుంది. నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.ఇదిలావుండగా, కోయంబత్తూరులోని



శరవణంపట్టి ప్రాంతంలోని ఎస్ఎన్ఎస్‌లో తమిళనాడు వెట్రికళగామ పోలింగ్ స్టేషన్ ఏజెంట్ల సదస్సు జరిగింది. 26, 27 తేదీల్లో కళాశాలలో జరుగుతుంది. పార్టీ నాయకుడు నటుడు విజయ్ కూడా 2 రోజుల సమావేశంలో పాల్గొని ప్రసంగించనున్నారు. దీనికోసం ఆయన 26వ తేదీన కోయంబత్తూరులో పర్యటించనున్నారు.పార్టీ ఏర్పడిన తర్వాత విజయ్ మొదటిసారి కోయంబత్తూరుకు వస్తున్నందున, తమిళనాడు విక్టరీ పార్టీ అతని ఉత్సాహాన్ని పెంచడానికి విస్తృతమైన ఏర్పాట్లు చేసింది.ఆ విధంగా, రాబోయే రోజుల్లో కోయంబత్తూరుకు రాజకీయ ప్రముఖులు ఉదయనిధి స్టాలిన్, ఎంపీ కనిమొళి, విజయ్ రాక సంచలనం సృష్టించింది. వారి రాకను దృష్టిలో ఉంచుకుని కోయంబత్తూరులో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.కోయంబత్తూరు నగరం మరియు జిల్లా పోలీసులు అప్రమత్తం చేయబడ్డారు మరియు భద్రతా కార్యకలాపాలను నిర్వహించడానికి సిద్ధమవుతున్నారు.



**(వేలూరు)** డేర్ టీవీ ఎల్ ఎస్ మూడవ వార్షికోత్సవం వేలూరు సమీపంలోని ఇడయన్ శాత్తు రామలింగ నగర్ లో తేడా పోటీలు జరిగింది ఇందులో 38 మంది పాల్గొని వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందారు గెలుపొందిన వారికి కన్యంబడి పోలీస్ ఇన్స్పెక్టర్ శుభ బహుమతులను అందజేశారు ఆమెతోపాటు కన్నియం బాడీ కౌన్సిలర్ శ్రీనివాసన్ రాజకుమార్ మాజీ సర్పంచ్ రామచంద్రన్ మాజీ వైస్ ప్రెసిడెంట్ వెంకట్రామన్ తదితరులు పాల్గొన్నారు

